
**కథ** -సి.వి.నరసింహదాసు

**పూర్తిగా కళ్ళు తెరచి చూసేందుకు కూడా ఓపిక లేనంత నీరసంగా వుంది. శరీరం నిండా సూదులు గుచ్చుతున్న బాధ. గుండెల్లో గునపాలతో పొడుస్తున్నట్టు భయంకరమైన నొప్పి.**

# అనుబంధాలు



**ఈ శరీరం కట్టెలా మారిపోయి, గుండె బండ బారిపోయి చాలా సంవత్సరాలయింది. బొందిలో ప్రాణం మిగిలివుందని తెలియజెప్పడానికి మాత్రమే. మనసులో గింగిర్లు కొడుతున్న ఆలోచనలు.**

ఒంటిమీద ఎండవేడి తెలుస్తోంది. వేసవికాలపు ఎండ..చెట్ల ఆకుల మధ్యలోంచి చుర్రున తగుల్తోంది. మధ్యాహ్నం మూడు గంటలయిందని చెప్పడానికి నాకే గడియారాలు అవసరం లేదు. గత డెబ్బయి ఏళ్ళుగా ఎన్ని శిశిరాలు, ఎన్ని వసంతాలు, ఎన్నెన్ని గ్రీష్మాలు చూశానో..మారే ప్రతి ఋతువూ నా జీవితంలో కొత్త అంకానికి తెరలేపుతూనే వచ్చింది.

అంతా అనుకున్నట్టు జరిగితే ఈపాటికీ శరీరం...? అయితే అనుకున్నది నేను కాదు. వాళ్ళు..నా వాళ్ళు..నా వాళ్ళని నేననుకున్న వాళ్ళు. వాళ్ళు గుర్తుకు రాగానే ఒళ్ళు ఒక్కసారిగా జలదరించింది.

కొద్దిగంటల క్రితం నా ప్రమేయం లేకుండానే నాలో కలిగిన ప్రకంపనలే, ప్రస్తుతం నేనిలా పడి వుండడానికి కారణమయ్యాయి. ఇంకొద్ది క్షణాలు ఆలస్యం అయి వుంటే..!

ఎక్కడ, ఎప్పుడు మొదలైందీ జీవితం...

ఊహ తెలిసేసరికే నేను నాన్న కూచిగా పేరు తెచ్చుకున్నాను.

''ఈ సరోజినమ్మ నా యింటి మహాలక్ష్మి. ఈ చిన్నారి తల్లి నా కంటి వెలుగుల రవ్వ''

నాన్న తన భుజాల మీద ఎత్తుకుని పొలానికెళ్తూ, దారి పొడవునా కనబడ్డ ప్రతి ఒక్కరికి గొప్పగా చెబుతుంటే గర్వంగా అనిపించేది.

స్వాతంత్ర్య పోరాటం ఉధృతంగా జరుగుతున్న రోజులు. నాన్నకి కాస్తో కూస్తో దేశాభిమానం వుండబట్టే నాకు 'సరోజినీదేవి' పేరు పెట్టుకున్నాడు. ఆ పేరు గొప్పతనమేంటో నేను ఐదో తరగతిలోకి వచ్చాక తెల్సింది. ఎంత గర్వంగా అనిపించిందో.

మా ఊరి మొత్తానికి స్కూల్లో చేరిన మొట్టమొదటి ఆడపిల్లని నేనే. ఆ తర్వాత నేను ఆదర్శంగా మరికొంతమంది అమ్మాయిలు స్కూల్లో చేరారు.

దగ్గర దగ్గరగా ఓ నూట పాతిక యిళ్ళున్న మా ఊరంటే ఎంత యిష్టమో, దానికి ఆనుకుని పారుతున్న ఏటికవతల వున్న పొలాలూ అంత యిష్టంగానూ వుండేవి. అందులో మాది రెండెకరాలే. అయితేనేం..ఆ పొలాలన్నీ

నావిగానే తిరిగేదాన్ని.

ఎప్పుడూ పచ్చ పచ్చగా కళకళలాడుతూండే చేలూ, పూలు, పండ్లతో అలరారే మామిడి, సపోటా, జీడి, పనస, జామ, అరటి తోటలు ఎప్పుడూ ఆహ్లాదంగా పలకరించేవి.

పెద్దచెవి జూకాలూ, ఎంచక్కని ముక్కుపుడక, కాళ్ళకి చిరుమువ్వల గజ్జెలు పెట్టుకుని, చిలకాకు పచ్చరంగు లంగా, ఎత్తుబోర్డరు జాకెట్టు వేసుకుని, జడగంటలు వూపుకుంటూ లేగ దూడల వెనక, పొలాల వెంట పరిగెడుతుంటే, జీవితం జాబిలిమీద సంతకంలా హాయిగా వుండేది.

''నా దిష్టి, నీ దిష్టి ఇరుగింటి దిష్టి, పొరుగింటి దిష్టి'' అంటూ అమ్మ అప్పుడప్పుడూ నిప్పుల మీద ఎండు మిరపకాయలతో దిష్టి తీస్తుంటే ఇంతింత కళ్ళతో వింతగా చూసేదాన్ని.

నాన్న నన్నెప్పుడూ ఆడపిల్లనని కట్టడి చేయలేదు. తనకి ఆ అవకాశాన్ని నేనిచ్చింది కూడా లేదు. షావుకారుగారబ్బాయి నాగభూషణం, దర్జీకొడుకు రాజబాబు, వడ్రంగి వాళ్ళ వీరభద్రుడు, మాష్టారబ్బాయి! బోసుబాబు వీళ్ళంతా ప్రాణమిత్రులే. స్నేహితురాళ్ళయితే లెక్కేలేదు.

నా చదువు ఏడో తరగతి దగ్గర ఆగిపోయింది. మా స్కూల్లో అంతవరకే వుంది మరి.

పక్క వూరు పంపి చదివించే ఆర్థిక స్థితి నాన్నకి లేదు. అందని వాటికి అర్రులు చాచే మనస్థితి నాకూ లేదు.

కొంచెం లేటుగా నా పధ్నాలుగో ఏట ఒంటి మీదకి ఓణీ వచ్చింది.

నాన్న కళ్ళల్లో ఓ ప్రక్క ఆనందం చూశాను. కానీ రెండో పక్క ఆందోళననీ చూశాను.

కారణం. నేను ఎదిగిన కూతురిని. కన్నవారి గుండెలపై కుంపటిని.

''నువ్వు నాకు బరువు కావెప్పటికీ..కానీ..పెళ్ళి చేసుకుని నువ్వెళ్ళిపోతే, నిన్నొదిలి మేమెలా బ్రతకగలమనే మా బాధ తల్లీ'' అంటూ నాన్న కళ్ళనీళ్ళు పెట్టుకుంటుంటే, నాకు ఏడుపు ఆగేది కాదు.

''నిన్నొదిలి వెళ్ళిపోయేదే అయితే నేను ఈ జన్మకి పెళ్ళి చేసుకోను నాన్నా'' అంటూ నాన్నని చుట్టేసి బావురుమనేదాన్ని.

''బావుందే..అబ్బా కూతుర్ల చోద్యం..వింటే నలుగురూ నవ్విపోతారు'' నేను పెళ్ళి కాదంటానని అలా అనేదే గానీ, అమ్మకీ నాపైన బెంగే..

లోకరీతి గెలిచింది. నేనూ పెళ్ళి చేసుకున్నాను. వాళ్ళదీ వ్యవసాయ కుటుంబమే. కాకపోతే ఆయనది ఊరికి దగ్గర్లో వున్న పట్నంలో గుమాస్తా గిరీ..

నా జీవితం పట్నవాసానికి మారింది.

ఆయన ఎంతో మంచివారు. నన్ను అపురూపంగా చూసుకునేవారు.

పద్దెనిమిదేళ్ళ అమ్మానాన్నల ముద్దు మురిపాలని ఆయన కొద్దినెలల్లోనే చవి చూపించగలిగారు.

నేనెంత అదృష్టవంతురాల్ని?

''మా సరోజినమ్మ ఎక్కడ అడుగుపెడితే అక్కడ బంగారమే..'' అమ్మానాన్నల ఆనందం రెట్టించింది.

అయితే నా ఆనందం లోనూ అపశ్రుతి వుందని కొద్దిరోజుల్లోనే తెలిసొచ్చింది.

''అమ్మాయి కడుపున కాయ, పండు యింకా కాయలేదా?'' అని ఊర్లోవారి ప్రశ్నలకి సమాధానం చెప్పడానికి వారికి నీళ్ళు నమలాల్సి వచ్చేది.

దోషం నాలోనే వుంది. ఆలోపాన్ని తన మీద వేసుకుని లోకం నుండి నన్ను కాపాడారు నా భర్త..కాదు..నా దేవుడు.

చేయని పూజలు లేవు. తిరగని గుళ్ళు గోపురాలు లేవు..చూపించని డాక్టర్లు లేరు.

కాలం నిరాశగా గడుస్తున్న వేళ, పెళ్ళయిన పదేళ్ళకి నా నోములు ఫలించాయి. దైవం కరుణించాడు.

నెల తప్పానని తెల్సిన క్షణాన మావారు తనే ఓ చిన్న పిల్లాడిలా కేరింతలు కొట్టారు. నన్ను ముద్దుల్లో ముంచెత్తారు.

కానీ డాక్టర్లు పొలపొంగుమీద నీళ్ళు చిలకరించారు. నా గర్భం నిలవదని తేల్చేశారు. నా ప్రాణానికే ప్రమాదమని చెప్పేశారు. వెంటనే గర్భ విచ్ఛిత్తికి ఆదేశించారు.

కొన్ని గంటలైనా నిలవని ఆనంద తరంగం.

నో..నో..వీల్లేదు..ఈ బిడ్డని నేను వదులుకోను..వదులుకోలేను..నా ప్రాణాలు పోయినా సరే..

డాక్టర్లు నన్ను మూర్ఖురాలన్నారు.

నాకన్నా బిడ్డలు తనకు ముఖ్యం కాదని ఆయన కూడా డాక్టర్లకే వంత పాడారు.

నేను నిర్ణయాన్ని మార్చుకోలేదు.

ప్రసవం దగ్గరపడేసరికి ప్రతిక్షణం, ఆందోళనే..అవే నాకు ఆఖరి క్షణాలా? అయినా పర్వాలేదు. అమ్మదనంలోని కమ్మదనాన్ని ఓ

## సుమంత్‌తో కమలిని పెళ్లి?

**ఈ వార్త కొంత కాలంగా టాలీవుడ్‌లో వినిపిస్తున్నా ఇంతదాకా కన్‌ఫర్మ్ కాలేదు. అయితే తాజా వార్తల ద్వారా అర్థమయ్యేదేంటంటే- అతి త్వరలోనే సుమంత్-కమలినీ ముఖర్జీ పెళ్లి చేసుకోబోతున్నారట. గతంలో కీర్తిరెడ్డితో జరిగిన సుమంత్ వివాహం ఏవో గొడవల కారణంగా విడాకులకు దారి తీసింది. 'గోదావరి' సినిమాలో సుమంత్-కమలినీ కలిసి నటించారు. అప్పటి నుంచే వీరి మధ్య ప్రేమ చిగురించి అది ఇప్పుడు పెళ్లికి దారితీస్తోందిట. శుభం!**



క్షణం అనుభవించినా చాలు. నా జన్మ ధన్యం..

పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. లోపలి పేగుల్ని బలవంతంగా గుంజేస్తున్న భరించలేనంత బాధతో నాకు స్పృహ తప్పింది.

డాక్టర్ల కృషి ఫలించింది. దాదాపు రెండు రోజుల తర్వాత నాకు పూర్తిగా స్పృహ వచ్చింది. మావారి ముఖంలో కొండంత వెలుగు. ఏ మూలో మిణుకు మిణుకుమంటున్న ఆశతో పక్కకు చూశాను.

ఆశ్చర్యంతో నా కనులు వెడల్పయ్యాయి. అక్కడ..ఒక్కరు కాదు...ఇద్దరు కాదు..ముగ్గురు.

అవును. నాకు ముగ్గురు పిల్లలు. ఒక మగ, ఇద్దరు ఆడ..

జీవితం ఓ అద్భుతం.

మనసారా మావారి చేతిని పెదాల కానించుకున్నాను. నా మనసు గ్రహించి, మాటకు విలువనిచ్చిన ఆయనకి మించిన దేవుడు నాకు లేడు. కృతజ్ఞతలు మీకెలా తెలుపుకోవాలో నాకంతకంటే మార్గం తోచలేదు.

ఆపై పిల్లల తోడిదే మా ప్రపంచమైంది. అదో కొత్త బంగారులోకం.

మా ఆర్థిక స్థితి కూడా క్రమంగా మెరుగైంది. ఉన్నంతలోనే పిల్లల ఉన్నతికి మా రక్తమాంసాలు ధారపోశాం. ముగ్గురికి ముగ్గురూ చదువుల్లో రాణించారు. మాకానందం కలిగించారు.

అంతలోనే అనుకోని విస్ఫోటనం..మా యింటి దైవం..గుండెపోటుతో మమ్మల్ని విడిచిపోయింది.


నేను మాత్రం మిగిలిపోయాను. ఈ పిల్లల కోసం నాశక్తిమేరా వాళ్ళని ప్రోత్సహించాను. తండ్రిలేని లోటు పూడ్చలేనిదైనా, నేనే నాన్ననయ్యాను. కష్టాల సుడిగుండాల్ని ఒక స్ఫూర్తితో దాటాను.

పిల్లలు ఉద్యోగస్తులై, పెళ్ళిపోయాక, మళ్ళీ ఒంటరిగా మిగిలిపోయాను. రెక్కలొచ్చిన పక్షుల్లా వారు ఎగిరిపోయారు. రెక్కలు తెగిన పక్షిలా నేనుండిపోయాను.

ఉద్యోగంలో స్థిరపడ్డాక నన్ను తనతో తీసుకెళ్తానన్న అబ్బాయి, ఎక్కడవున్నా తరచూ వచ్చి చూసిపోతామన్న అమ్మాయిలు..కాలంతోపాటు మారిపోయారు.

దానికితోడు..బైటపడిన మరో నిజం నన్ను వణికించింది. నా కడుపున మళ్ళీ కాయపడింది.

ఈసారి 'కేన్సర్' కాయ..బ్రతికుండానే ప్రత్యక్షనరకం చూపిస్తోంది. చావు తెచ్చే సుఖాన్ని తెలియజేస్తోంది.




పిల్లలంతా కుటుంబాల్తో వచ్చారు. బోలెడు ధైర్యం చెప్పి వెళ్ళారు. అలా నాలుగైదు సార్లయింది.

నెలలు గడుస్తున్నాయి. కేన్సరు కన్నా ఎక్కువగా బాధిస్తోంది ఒంటరితనం.

పిల్లల సంసారాన్ని ఏనాడూ సంతృప్తిగా చూసింది లేదు. మనవలు, మనవరాళ్ళతో ఆప్యాయంగా ఆడుకున్నదీ లేదు.

ఇవి తీరని కోరికలుగానే మిగిలిపోతాయా?

రోజు రోజుకీ వ్యాధి ముదిరిపోతోంది. అవును. అది మనోవ్యాధి కూడా.

చివరికి..మంచంపై నుండి లేవలేని పరిస్థితి. పిల్లలొచ్చారు. మరోసారి..

''అమ్మ యిక బ్రతికే ఛాన్సు లేదు. ఆఖరి ప్రయత్నంగా హాస్పిటల్‌కి తీసుకువెళ్ళాం అన్నయ్యా'' అంటోంది రెండో అమ్మాయి.

''బహుశా యిక యింటికి తీసుకొచ్చే అవసరం రాకపోవచ్చు'' పెద్దమ్మాయి తేల్చేసింది.

ఆసుపత్రి..పరీక్షలు..మందులు..లేజర్ థెరపీలు..ఐసియూలో నాల్రోజులున్నాను.

నా ఆయువు తీరలేదు.

''నౌ షి ఈజ్ ఓకే. ట్రీట్‌మెంట్ రెగ్యులర్‌గా తీసుకోండి. ఆమెని యింటికి తీసుకుపోవచ్చు'' డాక్టర్లు నన్ను డిస్చార్జ్ చేసేశారు.

''ఏమిటే ఇలా జరిగింది. తను బ్రతికేదీ, చచ్చేదీ తెలీక మధ్యలో నాకు చచ్చే చావొచ్చింది. ట్రీట్‌మెంట్‌కి వేలకి వేలు కరిగిపోతున్నాయి. సీరియస్సని చూట్టానికి వచ్చినప్పుడల్లా శెలవులు వేస్టయిపోతున్నాయి'' విసుక్కుంటున్నాడు అబ్బాయి.

''సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌వి..నెలకి ఏభై వేలు జీతం వచ్చే నీకే యిలా వుంటే, ఏదో గొర్రెతోక జీతగాళ్ళం..మా పరిస్థితేమిటి? మా ఆయన ఈమధ్య మరీ విసుక్కుంటున్నారు'' అంటోంది పెద్దమ్మాయి.

''అనుకోకూడదు గానీ అమ్మ బ్రతికుండి ప్రయోజనమేమిటీ?'' నా ఉనికినే ప్రశ్నించింది రెండోది.

కోడలు, అల్లుళ్ళు జతకలిసారు వారికి. సంభాషణలు నాకు వినిపిస్తూనే వున్నాయి. శరీరం మాత్రం అచేతనంగా వుంది.

చివరికి వారి నిర్ణయం.

ఏ పిల్లలకోసం ఒకనాడు నేను పరితపించానో, ఎవరికోసం నా ప్రాణాన్ని కూడా ఫణంగా పెట్టానో, వారే..వారి అస్థిత్వానికి కారణం అయిన అమ్మను..నన్ను బ్రతికుండగానే..

నా మెడలో దండవేశారు. కాళ్ళకి దండం పెట్టారు. చావు కార్యక్రమం పూర్తిచేసి, స్మశానానికి తీసుకొచ్చారు. కొడుకు కోడలు, కూతుళ్ళు అల్లుళ్ల బిగ్గరగా ఏడుస్తున్నారు. కాటికాపరి గుండె కూడా చెమ్మగిల్లేలా.

కన్నకొడుకు తలకొరివి పెట్టబోతున్నాడు...సరిగ్గా అదే క్షణాన..అనుబంధాలన్నీ తెగిపోతున్న వేళ..ఎందుకో వారి ముఖాలు చూడాలనిపించింది.

శక్తినంతా కూడదీసుకుని కళ్ళు తెరిచాను. శరీరంలో చిన్న కుదుపు..

''అయ్యబాబోయ్..ఆవిడ బ్రతికే వుందండోయ్'' అరిచాడు కాపరి.

ఉలిక్కిపడ్డారందరూ..శరీరం నిండా చెమటలతో నిజం బయటపడిందనే భయంతో.

వింత చూడటానికి ఎవరెవరో చేరారు. నన్ను కట్టెలపై నుండి దింపి చెట్టుక్రింద చప్టా మీద పడుకోబెట్టారు.

ఈ హడావుడిలో..నా వాళ్ళు ఎక్కడున్నారో?

ప్రస్తుతం...

నేను శవాన్ని కాను. స్మశానంలో అనాధ జీవచ్ఛవాన్ని. బస్టాండుల్లో, రైల్వేస్టేషన్లలో, పేవ్‌మెంట్ల మీద నాలా ఎందరో..నాన్న తరంలోనూ, మా తరంలోనూ వున్న విలువలు, నా బిడ్డల తరానికి వచ్చేసరికి మట్టిలో కలిసిపోయాయేం? శత్రువునైనా ఆపదలో వుంటే ఆదుకునే సంస్కృతి నుంచి స్వంత ఆనందాల కోసం కన్నవారినే కడతేర్చే కలుపుమొక్కలు పుట్టుకొస్తున్నాయేం?

ఏమైపోతోంది మానవతావాదం?

ఓ కన్నీటిచుక్క నా గుండెల్లో గడ్డకట్టింది. మరుక్షణం..ఆ గుండె స్పందన ఆగిపోయింది..శాశ్వతంగా.

☆